క్లుప్తంగా

బుచ్చిలో సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుప్రజ

బుచ్చిరెడ్డిపాళెంరూరల్ : పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో 8, 9, 18వ వార్డులకు సంబంధించి సర్వసభ్య సమాఖ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మాట్లాడారు. పొదుపు రుణాలను ఎప్పటికప్పుడు చెల్లించాలని సూచించారు. పొదుపు రుణాలను వ్యాపార అభివృద్ధికి వాడుకుని అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నస్రిన్, వెంకటశివకుమార్‌రెడ్డి, జయంతి, పొదుపు సీఓ నర్మద తదితరులు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రికి 20 వీల్‌చైర్ల వితరణ



నెల్లూరు(అర్బన్) : నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(పెద్దాస్పత్రి)కి పది మంది స్నేహితులు కలిసి రూ.లక్షకు పైగా విలువైన 20 వీల్‌చైర్‌లను వితరణ చేశారు. వీటిని పెద్దాస్పత్రి, మెడికల్ కళాశాల అభివృద్ధి కమిటీ కో–ఆర్డినేటర్ లక్ష్మీసునంద చేతుల మీదుగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్‌కు శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా కో–ఆర్డినేటర్ మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రిలో అన్ని సౌకర్యాలున్నాయని, అయితే వీల్‌చైర్‌ల అవసరాన్ని వివరించగా కోట జనార్ధన్‌రెడ్డి, ఎం.వెంకటేశ్వరరెడ్డి, కె.ప్రసాద్‌రెడ్డి, ఎం.వేణు, పి.మురళీకృష్ణారెడ్డి, ఎస్.సతీష్, సీహెచ్.దిలీప్‌కుమార్, ఒ.మురళి, కె.సురేష్, ఎండీఆర్‌రెడ్డి తదితర మిత్ర బృందం వారు తక్షణమే స్పందించి వీల్‌చైర్‌లు అందించడం సంతోషకరమని తెలిపారు. అనంతరం దాతలను సన్మానించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ శిద్దానాయక్, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా.నరేంద్ర, డాక్టర్ కళారాణి, డాక్టర్ మస్తాన్‌బాషా, డాక్టర్ గంగాధర్, నర్సింగ్ సూపరింటెండెంట్ గిరిజ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



విజయసాయిరెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న కామిరెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ సమన్వయకర్త విజయసాయిరెడ్డిని డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని విజయసాయిరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, సన్మానించారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

దివ్యాంగులకు రుణాల మంజూరు



దివ్యాంగులతో మాట్లాడుతున్న కాకాణి

నెల్లూరు(దర్గామిట్ట): కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థ నేషనల్ హ్యాండీక్రాఫ్ట్ ఫైనాన్షియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన 19 మందికి రుణాలు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన చెక్కును రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. స్వయం ఉపాధి నిమిత్తం రూ.43,50,000లు మంజూరైనట్లు తెలిపారు.

దేవగిరిక్షేత్రంలో ప్రత్యేక పూజలు

నెల్లూరు సిటీ : రూరల్ మండలంలో కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత దేవస్థానం ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు విశేషాలంకరణ చేశారు. అనంతరం వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, పూజలు జరిపించారు. ఉభయకర్తలుగా బెంగళూరుకు చెందిన అడపాల నరేశ్, మంజుల కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వి.గిరికృష్ణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్నివర్గాలకు మేలు

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



తాగునీటి పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్నివర్గాల ప్రజలకు మేలు జరిగిందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని జొన్నవాడ గ్రామంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎంపీ లాడ్స్ రూ.10 లక్షలు, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలు, ఎంపీపీ నిధులు రూ.5 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లను ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే జొన్నవాడ గ్రామంలో జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.21.18 లక్షలతో రక్షిత తాగునీటి పథకాన్ని ప్రారంభించామన్నారు. జొన్నవాడ ఆలయానికి సంబంధించి రూ.70 లక్షలతో మరమ్మతులు చేసిన రక్షణగోడను ప్రారంభించామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో, గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనులను బేరీజు వేసుకుని ప్రజలు ఓటేయాలని సూచించారు. వంచనకు మారుపేరైన టీడీపీని నమ్మవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, పార్టీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, జొన్నవాడ ఆలయ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, స్థానిక నేతలు నాటా బాలకృష్ణ, ఎం.మురళీమోహనకృష్ణ, పి.సాగర్, ఎం.శివకుమార్ పాల్గొన్నారు.

ఉదారంగా సీఎంఆర్‌ఎఫ్ సాయం



సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న మంత్రి కాకాణి

నెల్లూరు(దర్గామిట్ట) : సీఎం సహాయనిధి(సీఎంఆర్‌ఎఫ్) ద్వారా ఉదారంగా ఆర్థిక సాయం మంజూరు చేసి బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని డైకస్‌రోడ్డులో ఉన్న ఆయన క్యాంపు కార్యాలయంలో సర్వేపల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను శుక్రవారం అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద అనేక వ్యాధులను చేర్చి సమర్థవంతంగా వైద్యసేవలు అందిస్తున్నామని, ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వ్యాధులకు వైద్యం చేయించుకున్న వారు అప్పులపాలు కాకుండా ఉండాలనే ఉద్దేశంతో సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సాయం అందిస్తున్నట్లు చెప్పారు. పేదల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ అన్నివర్గాలకు అండగా నిలుస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

చెన్నారెడ్డిపల్లిలో ఉచిత వైద్యశిబిరం



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

పొదలకూరు : మండలంలోని చెన్నారెడ్డిపల్లి గ్రామంలో కరుణామయి చారిటబుల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వైద్యనిపుణులు శ్రీవాణి, జండల్ సజారీ, అన్వేష్, నిఖిల్, మురళీ, ప్రభాకర్‌రెడ్డి వైద్యపరీక్షలు నిర్వహించారు. సుమారు 400 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు హాస్పిటల్ ఎండీ విజయభారత్ తెలిపారు. 80 మంది పాఠశాలల పిల్లలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా టూత్‌బ్రష్‌లు, పేస్టులను అందజేశారు. శిబిరానికి హాజరైన వారిలో 40 మందికి శస్త్రచికిత్సలు అవసరమని పేర్కొన్నారు. వైద్యశిబిరంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

జగనన్నను ఆశీర్వదించండి



ముత్తుకూరు : ఎమ్మార్వో గిరిజనకాలనీలో ప్రచారం చేస్తున్న నాయకులు



ముత్తుకూరు : బీఎస్ కండ్రిగలో..

ముత్తుకూరు : రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు మేలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ నేతలు కోరారు. ఈ మేరకు ముత్తుకూరులో వారు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక ఎమ్మార్వో గిరిజనకాలనీలో తుమ్మతాటి రాజశేఖర్ ఆధ్వర్యంలో మహిళలు ఇల్లిల్లూ తిరిగి, నవరత్నాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఇచ్చిన హామీలు నెరవేర్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సర్వేపల్లి నియోజకవర్గంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. వీరి వెంట మునగాల రాజా, మల్లికార్జున, వరమ్మ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని గెలిపించాలి

ముత్తుకూరు : రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించుకోవాలని ఎంపీపీ గండవరం సుగుణ విజ్ఞప్తి చేశారు. ముత్తుకూరు పంచాయతీలోని బోడిస్వామికండ్రిగలో శుక్రవారం ఎన్నికల ప్రచారం చేశారు. సర్వేపల్లి నియోజకవర్గంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. అనంతరం నవరత్నాల కరపత్రాలను పంపిణీ చేశారు. గండవరం సూరి తదితరులు పాల్గొన్నారు.

అందరివాడు కాకాణి రమణారెడ్డి



నీటి ట్యాంకర్, ఫ్రీజర్‌ను ప్రారంభిస్తున్న పూజితారెడ్డి

పొదలకూరు : కాకాణి రమణారెడ్డి అందరివాడు అని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజితారెడ్డి అన్నారు. పట్టణంలోని హంసరెడ్డి కల్యాణ మండపంలో కాకాణి రమణారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నీళ్ల ట్యాంకర్, ఫ్రీజర్, కాంక్రీట్ మిల్లర్, బేల్దారి సామగ్రిని అందజేసి పూజితారెడ్డి చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మా తాతయ్య అభిమానులు సుమారు రూ.4 లక్షల విలువైన సామగ్రిని పేదల కోసం అందజేయడం సంతోషంగా ఉందన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ నిర్మలమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, పార్టీ నేతలు ఎం.శేఖర్‌బాబు, మద్దిరెడ్డి రమణారెడ్డి, హంసరెడ్డి, ఖాదర్, భారతమ్మ, ఎం.శివప్రసాద్, హర్ష, విష్ణు, వార్డు సభ్యులు అంజాద్, మూర్తిరెడ్డి, హేమంత్, కండేవాసు, హరి, భాస్కర్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి తప్పక పాటించాలి



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ చిరంజీవి



కోవూరు : మాట్లాడుతున్న తహసీల్దార్ విజయశ్రీ

మనుబోలు : ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు తప్పనిసరిగా ఎన్నికల నియమావళి పాటించాలని తహసీల్దార్ కె.చిరంజీవి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులకు ఎన్నికల నియమావళిపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచి ప్రక్రియ పూర్తయ్యే వరకు నియమావళి అమలులో ఉంటుందన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నియమ నిబంధనలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పార్టీలకు సంబంధించిన నాయకుల విగ్రహాలకు ముసుగు వేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ ప్రసాద్, వీఆర్వోలు నాగార్జునరెడ్డి, మురళీధర్, శ్రీనివాసులు ఉన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

కోవూరు : ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వర్తించాలని తహసీల్దార్ విజయశ్రీ అన్నారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో శుక్రవారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న సాధారణ ఎన్నికలకు సంబంధించి ప్రతి వీఆర్వో వారి పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సమాచారం పొందుపరుచుకోవాలన్నారు. అదేవిధంగా అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన



మాట్లాడుతున్న డీఎస్‌ఓ వెంకటరమణ

నెల్లూరు(పొగతోట) : వినియోగదారుల హక్కులపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటామని డీఎస్‌ఓ వెంకటరమణ అన్నారు. నగరంలోని డీఎస్‌ఓ కార్యాలయంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వస్తువులను కొనుగోలు చేసినప్పుడు నాణ్యతా ప్రమాణాలు పరిశీలించాలన్నారు కష్టమర్లను మోసగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఏఎస్‌ఓ అంకయ్య పాల్గొన్నారు

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటార్ బైక్ అదుపుతప్పి వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని తిక్కవరప్పాడు సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. సర్వేపల్లి నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న బైక్ తిక్కవరప్పాడు సమీపంలో ఆటో అడ్డురావడంతో అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న కృష్ణప్రసాద్‌కు గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పట్టుదలతో చదివితే విజయం



విద్యాసామగ్రిని అందజేస్తున్న ఎస్సై అజయ్‌కుమార్

మనుబోలు : పట్టుదలతో చదివితే విజయం తథ్యమని ఎస్సై అజయ్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. మనుబోలు జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వెంకన్నపాళెనికి చెందిన స్వర్ణకుమారి తన మనుమడు చింటూ జ్ఞాపకార్థం అందజేసిన పరీక్ష సామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యకు పేదరికం అడ్డుకాదని, కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఉంటే ఏదైనా సాధ్యమన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వసంతకుమారి, వీఆర్‌పీ రమేష్, ఉపాధ్యాయులు ఉషారాణి, కృష్ణజ్యోతి, ప్రియాంక, మృదుల, పీడీ ప్రమీలారాణి తదితరులు పాల్గొన్నారు.


పకడ్బందీగా పది పరీక్షలు



హెచ్ఎంతో మాట్లాడుతున్న ఎస్సై అజయ్‌కుమార్

మనుబోలు : పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై అజయ్‌కుమార్ తెలిపారు. ఈనెల 18 నుంచి పదో తరగతి పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో మనుబోలు జెడ్పీ బాలుర, బాలికల పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను శుక్రవారం పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హెచ్ఎం వసంతకుమారితో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరీక్షలు ప్రారంభమైనప్పటి నుంచి బయటి వ్యక్తులను పాఠశాల ఆవరణలోకి అనుమతించమన్నారు. జెరాక్స్ కేంద్రాలను మూసివేయిస్తామన్నారు. పరీక్షలు జరిగే సమయంలో పాఠశాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. ఆకతాయిలపై గట్టి నిఘా పెట్టినట్లు తెలియజేశారు.

స్వేచ్ఛగా ఓటు వేయాలి



కోవూరు : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కోవూరు మండలంలోని ప్రధాన గ్రామాల్లో సీఐ శ్రీనివాసరావు పర్యవేక్షణలో సీఆర్‌పీఎఫ్ జవాన్లు శుక్రవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా ఓటు వేయాలన్నారు. లేగుంటపాడు, వేగూరు, ఇనమడుగు తదితర గ్రామాల్లో కవాతు సాగింది. కార్యక్రమంలో ట్రెయినీ డీఎస్పీ హేమలత, కోవూరు ఎస్సై రంగనాథ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం



సూచనలు చేస్తున్న సూపర్‌వైజర్ నిర్మల

కొడవలూరు: పోషకాహార లోపం తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే అనేక రకాల వ్యాధులు దూరమవుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల సూచించారు. మండలంలోని రామన్నపాళెం–1 అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు విధిగా తీసుకోవాలన్నారు. తద్వారా పోషకాహార లోపాన్ని అధిగమించవచ్చని చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రత లోపిస్తే అనేక రకాల వ్యాధులు సోకే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త రోజా, ఆశా కార్యకర్త మమత పాల్గొన్నారు.

ఏపీసీసీ ఎస్సీసెల్ వైస్ చైర్మన్‌గా మధు



నియామక పత్రం అందుకుంటున్న మధు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : ఏపీసీసీ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్‌గా బుచ్చిరెడ్డిపాళెం మండలానికి చెందిన పి.మధు నియమితులయ్యారు. విజయవాడలోని ఏపీసీసీ కార్యాలయంలో ఆయన శుక్రవారం నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ తనపై నమ్మకముంచి ఎస్సీ సెల్ వైస్ చైర్మన్‌గా నియమించినందుకు ఏపీసీసీ చైర్‌పర్సన్ షర్మిలతో పాటు పార్టీ పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి పాటుపడతానని వివరించారు.

ఆరోగ్య సురక్షతో పేదలకు మేలు



కొడవలూరు : మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ డేవిడ్

కొడవలూరు : జగనన్న ఆరోగ్య సురక్షతో గ్రామీణ పేద ప్రజలకు ఎంతో మేలు అని ఈఓపీఆర్డీ వి.డేవిడ్ అన్నారు. మండలంలోని మిక్కిలింపేటలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చిన్నపాటి అనారోగ్యాలకు గురైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి బాగు చేస్తారన్నారు. దీనిని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం 453 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య నిపుణులు అనూష, శ్రీలేఖ, స్వాతి, పీహెచ్‌సీ వైద్యాధికారి కావ్య, సర్పంచ్‌లు మారంరెడ్డి రంగారెడ్డి, వల్లాపురం నవీన్ పాల్గొన్నారు.

పొదలకూరులో..

పొదలకూరు : పట్టణంలోని సచివాలయం బిట్–1 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష–2 వైద్యశిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు శిబిరానికి హాజరైన వారికి పరీక్షలు జరిపారు. బీపీ, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారిని నెల్లూరు జీజీహెచ్‌కు పంపుతున్నట్లు వైద్యాధికారులు వెల్లడించారు. శిబిరంలో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ రోగులకు సురక్ష కిట్లను అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు నరసింహారావు, కావ్యశ్రీ, కిరణ్‌రిషిత, పంచాయతీ కార్యదర్శి దొరబాబు, వార్డుసభ్యుడు అంజాద్, భారతమ్మ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్' లక్ష్యం

తోటపల్లిగూడూరు : 'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్' లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎంపీడీఓ నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని వెంకన్నపాళెం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష–2 క్యాంపు శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని, అందులో భాగంగా ఆరోగ్య సురక్ష శిబిరాలను గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కోడూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు భానుప్రియ, నిఖిలేష్ గుప్తా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. మొత్తం 422 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు దువ్వూరు గంగాధరరెడ్డి, చింతా ధనయ్య, ముత్యాల మల్లేశ్వర్, వెంకట కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు : శిబిరానికి హాజరైన వారికి మందులను అందజేస్తున్న జెడ్పీటీసీ నిర్మలమ్మ



తోటపల్లిగూడూరు : వెంకన్నపాళెంలో..

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో మంత్రి కాకాణి

పొదలకూరు : మండలంలోని పార్లపల్లి ఎస్సీ కాలనీకి చెందిన పలువురు తెలుగుదేశం పార్టీని వీడి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కుంచం శ్రీనివాసులు ఆధ్వర్యంలో సుబ్బమ్మ, వెంకటసురేష్, మౌనిక, హరిబాబు తదితర 30 కుటుంబాల వారిని కాకాణి సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువాలు కప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి సముచిత స్థానం ఇస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం ఖాయమన్నారు. వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ నేతలు వి.శివారెడ్డి, గోపాల్‌నాయుడు, శ్రీహరి పాల్గొన్నారు.

బజాజ్ షోరూమ్‌లో రూ.1.80 లక్షల చోరీ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని బజాజ్ షోరూమ్‌లో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రూ.1.80 లక్షలు నగదును దోచుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని బజాజ్ షోరూమ్ పైనుంచి జింకు రేకులు పగులగొట్టి గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు లోపలికి ప్రవేశించారు. సీసీ కెమెరాలను ధ్వంసం చేసి టేబుల్ డెస్క్‌లో ఉన్న రూ.1.80 లక్షలను దోచుకెళ్లారు. షోరూమ్ నిర్వాహకుడు కె.శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ హైమారావు తెలిపారు.